ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

బుధవారం 26 జూన్ 2024



కళ్లకుర్చి వ్యవహారంపై
గొడవ..గొడవ

- అన్నాడీఎంకే సభ్యుల వాకౌట్
- ప్రతిపక్ష సభ్యులను ఒకరోజు బహిష్కరించిన స్పీకర్



అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్న అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి, ఆ పార్టీ శాసనసభ్యులు

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో కళ్లకుర్చి దుర్ఘటనపై ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేసి చర్చకు అనుమతించాలని కోరుతూ అన్నాడీఎంకే శాసనసభ్యులు మంగళవారం ఉదయం అసెంబ్లీలో గలాభా సృష్టించారు. ఆ తర్వాత కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనపై సీబీఐ విచారణ జరపాలని నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. మంత్రి కేఎన్ నెహ్రూ ప్రతిపాదన మేరకు సభలో గలాభా సృష్టించిన అన్నాడీఎంకే శాసనసభ్యులందరూ మంగళవారం జరిగే శాసనసభ సమావేశాల్లో పాల్గొనకుండా వారిని స్పీకర్ బహిష్కరించారు. మంగళవారం ఉదయం ప్రధాన ప్రతిపక్ష అన్నాడీఎంకే సభాపక్షనాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), ఆ పార్టీ సభ్యులు కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ నల్లచొక్కాలు ధరించి అసెంబ్లీ సమావేశానికి వచ్చారు. సభ ప్రారంభం కాగానే ఈపీఎస్, అన్నాడీఎంకే సభ్యులంతా లేచి కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనపై సీబీఐ విచారణ జరపాలని, సభలో చర్చించేందుకు అనుమతించాలని పట్టుబట్టారు. సభలో ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత కళ్లకుర్చి వ్యవహారంపై మాట్లాడేందుకు తప్పకుండా అనుమతిస్తానని, అంతవరకూ ప్రశాంతంగా ఉండాలని స్పీకర్ అప్పావు ఆదేశించారు. అయితే ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేసి తమకు అనుమతించాలని ఈపీఎస్ స్పీకర్‌పై ఒత్తిడి చేశారు. దీంతో శాసనసభ సమావేశాల్లో అన్నాడీఎంకే సభ్యులు పాల్గొనకుండా నిషేధం విధించాలని కోరుతూ మంత్రి కేఎన్ నెహ్రూ ప్రతిపాదించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ జోక్యం చేసుకుంటూ అన్నాడీఎంకే సభ్యులు సమావేశాల్లో తప్పకుండా పాల్గొనాలని తాను ఆశిస్తున్నానని, కనుక ఆ సభ్యులు మంగళవారం జరిగే సమావేశానికి మళ్ళీ హాజరుకాకుండా నిషేధం విధిస్తే సమంజసంగా ఉటుందన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కోరిక మేరకు స్పీకర్ అప్పావు అన్నాడీఎంకే సభ్యులంతా మంగళవారం సభా వ్యవహారాలలో పాల్గొనకుండా నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. సభలో అన్నాడీఎంకే సభ్యులు చేసిన ప్రసంగాలు, గలాభా వివరాలు సభ రికార్డుల నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత అన్నాడీఎంకే సభ్యులంతా కళ్లకుర్చి దుర్ఘటనపై సీబీఐ విచారణ జరపాలంటూ నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.



శాసనసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

రెండేళ్లలో
46000 ప్రభుత్వ ఉద్యోగాలు

- అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే రెండేళ్లలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 46 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం జరిగిన శాసనసభ సమావేశంలో సభా నిబంధన 110 కింద ప్రకటన చేశారు. గత మూడేళ్లుగా అమలు చేస్తున్న 'పుదు మైపెణ్', 'తమిళ్‌పుదల్వన్', 'నాన్ ముదల్వన్' వంటి పథకాల కారణంగా యువతీయువకులకు ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తున్నాయని చెప్పారు. తమది ద్రావిడ తరహా ప్రభుత్వమని, ఎల్లప్పుడూ రాబోయే ఎన్నికల గురించి కాకుండా భావితరాల సంక్షేమంపైనే దృష్టిసారిస్తుందన్నారు. గత మూడేళ్లలో టీఎన్‌పీఎస్సీ, వైద్య సిబ్బంది ఎంపిక తదితర సంస్థలు నిర్వహించిన పరీక్షల ద్వారా ఎంపికైన 32,774 మందికి వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు వివరించారు. అదే విధంగా స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ 32,709 మందికి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఇక గత మూడేళ్లలో 77,76,999 మంది నిరుద్యోగ యువకులకు ప్రైవేటు సంస్థల్లోనూ ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. తన డ్రీమ్ ప్రాజెక్టు 'నాన్ ముదల్వన్ పథకం' ద్వారా అదనపు ప్రతిభా పాటవాలపై శిక్షణ పొందిన 3,06,459 మందికి ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 2026 జనవరిలోగా 46,584 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. టీఎన్‌పీఎస్సీ ద్వారా 17,695 పోస్టులు, టీచర్స్ సెలక్షన్ బోర్డు ద్వారా 18,260 పోస్టులు, వైద్య సిబ్బంది ఎంపిక సంస్థ ద్వారా 3041 పోస్టులు, రాష్ట్ర యూనిఫాం సిబ్బంది ఎంపిక బోర్డు ద్వారా 6688 పోస్టులను భర్తీ చేస్తామని పాలకపక్షం సభ్యుల హర్షధ్వానాల నడుమ పేర్కొన్నారు.

ఓటమిని తట్టుకోలేకే అన్నాడీఎంకే రభస....

లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోవటం వల్లే ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే సభ్యులు పనిగట్టుకుని శాసనసభలో రోజూ గలాభా సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోపించారు. కళ్లకుర్చి కల్తీ సార దుర్ఘటనపై ఈ నెల 20న గంటకుపై సభలో వివిధ పార్టీలకు చెందిన శాసనసభ్యులు ప్రసంగించారని, ఆ సభ్యులు లేవనెత్తిన అనుమానాలను నివృత్తి చేసేలా తాను సమాధానమిచ్చానని తెలిపారు. అయితే శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాతే ఎంతటి కీలకమైన, ప్రధానమైన, అత్యవసరమైన అంశాలను ప్రస్తావించాలన్న సభా నియమం బాగా తెలిసిన ప్రధాన ప్రతిపక్ష సభ్యులు పనిగట్టుకుని ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేసి కళ్లకుర్చి సంఘటనపై మాట్లాడేందుకు అనుమతించాలని పట్టుబట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనపై అన్నాడీఎంకే సభ్యులు తమ అభిప్రాయాలను తెలిపి ఉంటే తాను సభాముఖంగా సమాధానాలు తెలిపేందుకు సిద్ధమన్నారు. ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత కళ్లకుర్చి సంఘటనపై అన్నాడీఎంకే సభ్యులను మాట్లాడేందుకు తప్పకుండా అనుమతిస్తానని సభాపతి పలుమార్లు ప్రకటించినా పట్టించుకోకుండా ఆ పార్టీ సభ్యులు వరుసగా సభకు రావటం గలాభా సృష్టించడం వీలయితే వాకౌట్ చేయడం లేకుంటే మార్షల్స్ చేత గెంటివేయించుకోవడం ఆనవాయితీగా పెట్టుకున్నారని స్టాలిన్ విమర్శించారు.

ఈపీఎస్ సీబీఐ విచారణ కోరటమా?...

కళ్లకుర్చి కల్తీసార దుర్ఘటనపై సీబీఐ విచారణ కోరుతూ ప్రతిపక్షనాయకుడు ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), ఆ పార్టీ నేతలు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని స్టాలిన్ అన్నారు. ఈపీఎస్‌పై డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి ఓ ఆరోపణ చేసి, ఆ రోపణపై సీబీఐ విచారణ జరిపేందుకు కోర్టు ఉత్తర్వు జారీ చేసిందని, అయితే ఈపీఎస్ సీబీఐ విచారణపై తనకు నమ్మకంలేదని చెబుతూ దిగువకోర్టు ఉత్తర్వుపై స్టే తెచ్చుకున్నారని స్టాలిన్ గుర్తు చేశారు. సీబీఐపై నమ్మకం లేని ఈపీఎస్ కళ్లకుర్చి సంఘటనపై ఆ సంస్థతో విచారణ జరపాలని పట్టుబట్టడం వింత గాక మరేమిటని ప్రశ్నించారు. కళ్ళకుర్చి సంఘటనపై సమగ్రమంగా విచారణ జరిపేందుకు జస్టిస్ గోకుల్‌దాస్ కమిటీని నియమించామని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున తలా రూ.10లక్షల పరిహారం చెల్లిస్తున్నామని, చికిత్స పొందుతున్నవారిని నాణ్యమైన చికిత్స అందించేందుకు వారికి కూడా తలా రూ.50వేల సాయాన్ని అందించామని, జిల్లాకలెక్టర్, ఎస్పీ సహా పలువురు ఉన్నతాధికారులపై కూడా తమ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందన్నారు. ఇక కల్తీసారా వ్యవహారంతో సంబంధం ఉన్న సుమారు 30 మందిని సీబీసీఐడీ అరెస్టు చేసిందని, డీజీపీ, హోంశాఖ కార్యదర్శి కూడా కళ్లకుర్చిలో పర్యటించి విచారణ చేశారని, వారు త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారని తెలిపారు.

మాదకద్రవ్యాలకు నిలయంగా రాష్ట్రం

- కళ్లకుర్చి ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రాజీనామా చేయాలి
- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి
- గవర్నర్‌కు అన్నాడీఎంకే వినతిపత్రం



గవర్నర్ ఆర్ఎన్ రవికి వినతిపత్రం సమర్పిస్తున్న పళనిస్వామి తదితరులు

పెరంబూర్, జూన్ 25: రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడంతో పాటు మాదకద్రవ్యాలకు నిలయంగా మారిందని, కళ్లకుర్చి కల్తీ సారా ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షనేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో కొద్దిరోజుల క్రితం కల్తీ సారా తాగి సుమారు 60 మంది మృతి చెందగా, సుమారు 150 మందికి పైగా వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కల్తీ సారా విక్రయాలు అధికార పార్టీ అండదండలతో సాగుతున్నాయని, కళ్లకుర్చి కల్తీ సారా వ్యవహారంపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం రాజ్‌భవన్‌కు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి నేతృత్వంలో 61 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలతో కలసి వెళ్లి గవర్నర్ ఆర్ఎన్ రవికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాజ్‌భవన్ వెలుపల పళనిస్వామి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో సారా విక్రయాలకు అధికారపార్టీ అండదండలున్నాయని ఆరోపించారు. గతంలో తనపై నమోదైన కేసును సీబీఐచే విచారించాలని ప్రతిపక్ష నేతగా ఉన్న స్టాలిన్, ప్రస్తుతం కళ్లకుర్చి వ్యవహారంపై సీబీఐ దర్యాప్తును ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఏకసభ్య కమిషన్, సీబీసీఐడీ విచారణ కేవలం కంటి తడుపు చర్య మాత్రమేనన్నారు. ఈ వ్యవహారంపై అసెంబ్లీ మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని కోరినా స్పీకర్ అంగీకరించడం లేదన్నారు. తమ విజ్ఞప్తిపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని పళనిస్వామి తెలిపారు.

మతాంతర వివాహ కేసుల పరిష్కారానికి న్యాయవాదుల నియామకం

- అసెంబ్లీలో స్టాలిన్ ప్రకటన

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కులాంతర, మతాంతర వివాహాలు చేసుకునే జంటలకు హాని కలిగించే వారికి కఠిన శిక్ష పడేలా ఆ కేసులో సమర్థవంతంగా వాదించటానికి క్రిమినల్ లాయర్లను నియమించనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. శాసనసభలో తిరునల్వేలి జిల్లాలో మతాంతర వివాహ నేపథ్యంలో సీపీఎం కార్యాలయంపై దాడి సంఘటనపై ప్రతిపాదించిన సావధాన తీర్మానంపై కొందరు శాసనసభ్యులు ప్రసంగించారు. చివరగా ఆ సావధాన తీర్మానానికి బదులిచ్చిన ముఖ్యమంత్రి తిరునల్వేలి జిల్లా రెడ్డియార్‌పట్టిలోని సీపీఎం కార్యాలయంలో ఈ నెల 13న రెండు వేర్వేరు మతాలకు చెందిన జంటకు వివాహం జరిగిందని, ఆ వివాహానికి సంబంధించిన ఫొటో ఫేస్‌బుక్‌లో వెలువడగానే వధువు కుటుంబీకులు మరుసటి రోజు పార్టీ కార్యాలయంపై మూకుమ్మడిగా దాడి జరిపి ఫర్నిచర్ తదితర వస్తువులను ధ్వంసం చేశారని, దీనికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని 14 మందిని అరెస్టు చేశారని, వారిలో ఏడుగురు మహిళలు బెయిలుపై విడుదలయ్యారని తెలిపారు. అంటరానితనం నిరోధక చట్టం కింద కేసు నమోదుచేసుకుని పోలీసులు విచారణ జరుపుతున్నారన్నారు. మహిళలకు విద్య, పురుషులతో సమాన హక్కులు, కులాంతర వివాహాలకు తొలి నుండి గట్టి మద్దతునిచ్చే డీఎంకే ప్రభుత్వం సామాజిక న్యాయం వైపే ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం కులాంతర, మతాంతరం వివాహాలను వ్యతిరేకిస్తూ హింసాత్మక సంఘటనలకు పాల్పడేవారికి న్యాయస్థానాల్లో కఠిన శిక్షలు పడేలా తమ ప్రభుత్వం క్రిమినల్ లాయర్లను నియమించనున్నదని చెప్పారు.

సనాతన ధర్మంపై వ్యాఖ్యల వ్యవహారం...
బెంగళూరు కోర్టుకు మంత్రి ఉదయనిధి హాజరు

- నిబంధనలతో కూడిన బెయిల్ మంజూరు



బెంగళూరు కోర్టుకు హాజరవుతున్న మంత్రి ఉదయనిధి

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రి ఉదయనిధికి బెంగళూరు న్యాయస్థానం నిబంధనలతో కూడిన బెయిలు మంజూరు చేసింది. నగరంలో గత ఏడాది సెప్టెంబరు 20వ తేది 'సనాతన నిర్మూలన మహానాడు' జరిగింది. ఈ మహానాడులో పాల్గొన్న మంత్రి ఉదయనిధి.. డెంగ్యూ, మలేరియాల్లానే సనాతన ధర్మాన్ని నిర్మూలించాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు. దీనిపై దేశవ్యాప్తంగా పలు హిందూ సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు 8 కేసులు నమోదయ్యాయి. ఉదయనిధిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ బెంగళూరుకు చెందిన రమేష్ బెంగళూరులోని ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారిస్తున్న ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. ఈ 8 కేసులు వేర్వేరు రాష్ట్రాల్లో దాఖలైన నేపథ్యంలో, అన్నింటినీ ఒకటిగా చేర్చి ఒకే ప్రాంతంలో విచారించాలని కోరుతూ ఉదయనిధి తరఫున న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ముఖ్యంగా, ఉదయనిధితో పాటు, సనాతన ధర్మ నిర్మూలన మహానాడు ఏర్పాటుచేసిన వెంకటేష్, ఆదవన్, మధుకూర్ రామలింగం తదితరులపై కూడా క్రిమినల్ చర్యలు చేపట్టాలని రమేష్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

న్యాయస్థానంలో ఉదయనిధి హాజరు...

ఈ పిటిషన్‌కు వ్యతిరేకంగా వెంకటేష్, ఆధవన్, మధుకూర్ రామలింగం తదితరులు కర్ణాటక హైకోర్టులో క్రిమినల్ చర్యలపై స్టే విధించాలని కోరుతూ గత వారం పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణా ఎస్.దీక్షిత్, ఈ కేసులో క్రిమినల్ చర్యలు చేపట్టడంపై తాత్కాలిక స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయనిధి బెంగళూరు న్యాయస్థానంలో హాజరయ్యారు.

ఆగస్టు 8కి వాయిదా... : ఉదయనిధితో హాజరైన సీనియర్ న్యాయవాది పి.విల్సన్, ఆయనకు బెయిలు మంజూరు చేయాలని, కేసు విచారణకు నేరుగా హాజరుకావడంపై శాశ్వతంగా మినహాయింపు ఇవ్వాలని వేర్వేరు పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లు అంగీకరించిన న్యాయమూర్తి శరవణ.. ఉదయనిధికి బెయిలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అన్ని కేసులు ఒకటిగా విచారించాలన్న పిటిషన్లపై సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడిన అనంతరం, ఈ కేసు విచారణ చేపడతానని ప్రకటిస్తూ తదుపరి విచారణ ఆగస్టు 8వ తేదీకి వాయిదావేశారు. కాగా, బెంగళూరుకు న్యాయస్థానంలో మంత్రి ఉదయనిధి హాజరవుతుండడంతో కోర్టు ప్రాంగణంలో భారీ పోలీసు భద్రత ఏర్పాటుచేశారు.

ఇసుక అక్రమ విక్రయాలపై
ఐటీ అధికారుల విచారణ

ప్యారీస్, జూన్ 25: రాష్ట్రంలోని ఇసుక క్వారీల్లో జరిగిన అక్రమ విక్రయాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇసుక క్వారీల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై స్పందించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ) అధికారులు గత ఏడాది సెప్టెంబరులో రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో ఉన్న 8 క్వారీలకు సంబంధించిన ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. అప్పుడు ఇసుక క్వారీల నిర్వహణపై ఒప్పందం కుదుర్చుకున్న పారిశ్రామికవేత్తలు రామచంద్రన్, రత్నం, కరికాలన్, ఆడిటర్ షణ్ముఖరాజ్ ఇళ్లు, కార్యాలయాల్లో కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఈ క్వారీల్లో ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించారు. క్వారీల్లో నిల్వ ఉన్న ఇసుక, విక్రయాలకు సంబంధించిన రికార్డులు సైతం పరిశీలించారు. ఇందులో క్వారీల ద్వారా ఇసుక క్వారీల్లో నకిలీ రసీదులు సృష్టించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. మరికొన్ని దస్తావేజులు బినామీల పేర్లతో ఉన్నట్లు విచారణలో తేలింది. విచారణలో భాగంగా కాన్పూర్ ఐఐటీ సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకొని ప్రభుత్వం అనుమతించిన సామర్థ్యం కంటే అధికస్థాయిలో ఇసుక తవ్వినట్లు తెలిసింది. మొత్తం రూ.4,730 కోట్ల మేర ఇసుక విక్రయాలు జరిగిన నేపథ్యంలో, రికార్డులో చూపిన ఆదాయం రూ.36.45 కోట్లు. భారీస్థాయిలో జరిగిన ఈ అవినీతిపై ఈడీ అధికారులు విచారణ వేగవంతం చేసిన నేపథ్యంలో, పన్ను చెల్లించకుండా మోసం చేసిన కారణంగా దీనిపై విచారణ కోరుతూ ఐటీ, జీఎస్టీలకు ఈడీ అధికారులకు లేఖ రాశారు. దీని ఆధారంగా తాజాగా ఇసుక అక్రమ విక్రయాలపై విచారణ ముమ్మరం చేసిన అధికారులు, తిరుచ్చి సహా ఆరు జిల్లాల కలెక్టర్ల వద్ద పూర్తి వివరాలు కోరుతూ విచారణ జరిపారు. ఇసుక క్వారీల్లో లోడింగ్ కోసం గోబెల్కో కన్‌స్ట్రక్షన్ అనే సంస్థకు రాష్ట్రంలో ఉన్న 16 ప్రాంతాల్లో మొత్తం 273 యంత్రాలున్నట్లు తెలిసింది. పన్ను ఎగవేతకు సంబంధించి ఐటీ అధికారులు చేపట్టిన విచారణ ముగిసే సమయంలో మరికొన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశముంది.

కళ్లకుర్చిపై శ్వేతపత్రం

- డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత
- కార్యకర్తలతో కలిసి మహా ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న ప్రేమలత

పెరంబూర్, జూన్ 25 కళ్లకుర్చి కల్తీ సారా మృతులకు సంబంధించి వాస్తవాలు ప్రజలకు తెలియజేసేలా శ్వేతపత్రం విడుదల చేయాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో కళ్లకుర్చి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం డీఎండీకే ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో పాల్గొన్న పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత మాట్లాడుతూ.. కళ్లకుర్చి కల్తీ సారా ఘటనలో 60 మంది మృతిచెందడం తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న డీఎంకే, మరోవైపు టాస్మాక్ మద్యం విక్రయాలపై లక్ష్యాలు నిర్దేశించి, మహిళలను వితంతువుగా మారుస్తోందని విమర్శించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి ముత్తుస్వామి, కళ్లకుర్చి ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో గవర్నర్ ఆర్ఎన్ రవిని కలిసి కళ్లకుర్చి వ్యవహారంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని కోరనున్నామని తెలిపారు. అలాగే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షాలను కలుసుకొని, సీబీఐ విచారణకు, కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్ నియమించి కళ్లకుర్చి ఘటనపై విచారణ చేపట్టాలని కోరనున్నట్లు ప్రేమలత తెలిపారు. ఈ ఆందోళనలో పార్టీ జిల్లా కార్యదర్శులు ఎల్.వెంకటేశన్ (విల్లుపురం), ఎస్ఎస్ కరుణాకరన్ (కళ్లకుర్చి), రాష్ట్ర, జిల్లా, నగర శాఖల నిర్వాహకులు పాల్గొన్నారు.

సమాచార దృష్టి

శివనాడార్ యూనివర్సిటీలో న్యాయ కళాశాల ప్రారంభం

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివనాడార్ విశ్వవిద్యాలయంలో శివనాడార్ ఫౌండేషన్ సహకారంతో 'శివనాడార్ స్కూల్ ఆఫ్ లా' పేరుతో కొత్త న్యాయకళాశాల ప్రారంభమైందని ఆ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీమన్‌కుమార్ భట్టాచార్య తెలిపారు. ఈ కళాశాలలో ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సులో 60 సీట్ల అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈ కోర్సులో చేరదలచిన అభ్యర్థులు https://apply.snuchennaiadmissions.com/applicationformforschooloflaw వెబ్‌సైట్‌ద్వారా దరఖాస్తులను సమర్పించవచ్చునని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువు జూలై 10న ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు.

నేటినుంచి మదురై-బెంగళూరు మధ్య వందే భారత్ ప్రత్యేక రైలు

పెరంబూర్, జూన్ 25: మదురై నుంచి తిరుచ్చి మీదుగా బెంగళూరుకు వందే భారత్ రైలు అందుబాటులోకి రానుంది. ఈ రైలు మంగళవారం మినహా, బుధవారం నుంచి వచ్చే నెల 29వ తేది వరకు నడపనున్నారు. ఆ ప్రకారం, మదురై నుంచి బుధవారం తెల్లవారుజామున బయల్దేరేరైలు, తిరుచ్చికి ఉదయం 7 గంటలకు చేరుకొని, 7.12 గంటలకు బయల్దేరి కరూర్, సేలం మీదుగా మధ్యాహ్నం 1 గంటకు బెంగళూరు చేరుకుంటుంది. మరుమార్గంలో మధ్యాహ్నం 1.45 గంటలకు బెంగళూరులో బయల్దేరి తిరుచ్చి రాత్రి 7.35 గంటలకు చేరుకొని, 7.40 గంటలకు బయల్దేరి 9.45 గంటలకు మదురై చేరుకుంటుంది.

రేపు పంచవటి ఆలయ కుంభాభిషేకం

ఐసిఎఫ్, జూన్ 25: దిండువనం-పుదుచ్చేరి రోడ్డులోని పంచవటి ఆంజనేయస్వామి ఆలయ కుంభాభిషేకం గురువారం ఉదయం జరుగనుంది. శ్రీవారు శ్రీనివాస పెరుమాళ్ సన్నిధి వెనుకవైపున్న యాగశాలలో తెల్లవారుజామున 5.30 గంటల నుంచి ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు వలంపురి మహాగణపతి, సీతా సమేత పట్టాభిషేక రామచంద్రమూర్తి, వెంకటాచలపతి, 36 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామికి విశేష తిరుమంజనం జరుగనుంది. యాగశాల నుంచి బయల్దేరే ఘటాన్ని అన్ని సన్నిధి వీధుల్లో ఊరేగించనున్నారు. 11 గంటలకు దీపారాధన చేసి భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

122 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, జూన్ 25: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలతో మంగళవారం ఉదయం వరకు సాధారణం కన్నా 122 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఈ నెల 1 నుంచి సోమవారం వరకు సాధారణంగా 43.8 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈ ఏడాది 97.4 మి.మీ వర్షం కురిసిందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

తిరువికనగర్‌లో డిగ్రీ కళాశాల

ఐసిఎఫ్, జూన్ 25: స్థానిక తిరువిక నగర్ నియోజకవర్గంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఏర్పాటుచేయాలని డీఎంకే ఎమ్మెల్యే తాయగం కవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ... తిరువిక నగర్ నియోజకవర్గ పరిధిలో పురుషవాక్కం, పెరంబూర్, అయనావరం అనే మూడు తాలూకా కార్యాలయాలకు వెళ్లే పరిస్థితి ఉందని, వారు ఒకే తాలూకా కార్యాలయాన్ని వినియోగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే, ఈ నియోజకవర్గంలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కూడా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు ఈపీఎఫ్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూన్ 25: ఈపీఎఫ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'నిధి ఆప్కే నికత్ 2.0' పేరుతో గురువారం సెమ్మంజేరి రాజీవ్ గాంధీ రోడ్డులో ఉన్న జేపియర్ వర్సిటీలో గ్రీవెన్స్ జరుగనుంది. ఈ గ్రీవెన్స్‌లో పీఎఫ్ చందాదారులు, పింఛన్‌దారులు పాల్గొని తమ సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని అధికారులు తెలిపారు.

నేటినుంచి కేక్ తయారీపై శిక్షణ

ఐసిఎఫ్, జూన్ 25: బేకరీ వస్తువుల తయారీపై ఈకాట్టుతాంగల్ సిడ్కో ఎస్టేట్‌లో బుధవారం నుంచి 28వ తేది వరకు శిక్షణ జరుగనుంది. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్ల పైబడిన వారు శిక్షణలో పాల్గొనవచ్చు. ఇతర వివరాలకు 8668102600, 7010143022 నెంబర్లు సంప్రదించవచ్చు.

రూ.16 కోట్లతో శుద్ధీకరణ కేంద్రం

ఐసిఎఫ్, జూన్ 25: తాంబరం కార్పొరేషన్ పరిధిలోని సెంబాక్కం జలాశయంలో మురుగునీరు కలవకుండా రూ.16 కోట్లతో శుద్ధీకరణ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. సెంబాక్కం, చిట్లపాక్కం జలాశయాల్లో వర్షాకాల ముందు జాగ్రత్త చర్యలను సీఎండీఏ అధికారులు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... చిట్లపాక్కం జలాశయంలో పూడికతీత పనులు జరుగుతున్నాయని, అలాగే సెంబాక్కం జలాశయంలో కలుస్తున్న మురుగునీటిని శుద్ధీకరించేందుకు 8 ఎంఎల్డీ మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని రూ.16 కోట్లతో ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

వంద భాషల్లోకి 'తిరుక్కురల్' అనువాదం

ఐసిఎఫ్, జూన్ 25: తిరుక్కురల్‌ను వంద భాషల్లో అనువదించేందుకు సెమ్మొళి తమిళ పరిశోధన సంస్థ అర్హులైన నిపుణులను ఎంపిక చేయనుంది. పెరుంబాక్కంలో ఉన్న తమిళ పరిశోధన సంస్థలో సంఘ సాహిత్యాలపై పరిశోధనలు, ఉపన్యాసాలు, సదస్సులు, శిక్షణా శిబిరాలు, తర్జుమాలు వంటి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో, తిరుక్కురల్ ఇదివరకే 36 భాషల్లో అనువదించి విడుదల చేశారు. మరో 20 భాషల్లో అనువదించిన తిరుక్కురల్ త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో, మరో 100 భాషల్లో అనువాదం చేసేందుకు నిపుణులను ఎంపిక చేయనున్నారు. 55 దేశీయ భాషలు, 45 విదేశీ భాషల్లో పది నెలల పాటు తర్జుమా చేయనున్నారు. ఒక్కో భాష అనువాదానికి రూ.1.50 లక్షలు కేటాయించారు. అనువాద సామర్థ్యం, అర్హత కలిగిన వారు tirukkaural-translat-ion@cict.in అనే ఈ-మెయిల్ చిరునామా, www.cict.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

ఎయిడ్స్ రోగులకు ప్రత్యేక డయాలసిస్ యంత్రం

ఐసిఎఫ్, జూన్ 25: ప్రభుత్వాస్పత్రుల్లో ఎయిడ్స్ రోగులకు ప్రత్యేక డయాలసిస్ యంత్రం త్వరలో అందుబాటులోకి వస్తుందని మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు.శాసనసభలో మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వాసుపత్రుల్లో రక్త శుద్ధీకరణ యంత్రాలు (డయాలసిస్) పనితీరు బాగా ఉందని పేర్కొన్నారు. అయితే ఎయిడ్స్ రోగులకు ప్రత్యేక డయాలసిస్ యంత్రం కొరత ఉందని, నెలరోజుల్లో ఎయిడ్స్ రోగుల కోసం ప్రత్యేక డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

అరుంధతీయుల రిజర్వేషన్ పెంచాలి

● టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు



ధర్నాలో గొల్లపల్లి ఇశ్రాయేలు, నేలటూరు విజయకుమార్, వేశపోగు ఇశ్రాయేలు తదితరులు

ప్యారీస్, జూన్ 25: విద్య, ఉపాధి రంగాల్లో అరుంధతీయులకు కల్పించిన 3 శాతం రిజర్వేషన్‌ను 6 శాతానికి పెంచాలని తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరుంధతీయుల రిజర్వేషన్ అరుంధతీయులకే వర్తింపజేయాలి, మిగతా కులాలకు లబ్ధిచేకూర్చే విధంగా జారీచేసిన జీవో 61 రద్దు చేయాలి, అరుంధతీయుల రిజర్వేషన్ 6 శాతానికి పెంచాలి, పదోన్నతిలో ప్రాధాన్యత కల్పించాలి తదితర ఐదు అంశాల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టం సమీపంలో ధర్నా నిర్వహించారు. టామ్స్ అధ్యక్షులు నేలటూరు విజయకుమార్ అధ్యక్షత వహించగా, ఆది తమిళర్ కట్చి వ్యవస్థాపకులు కెజక్కయ్యన్, గొల్లపల్లి ఇశ్రాయేలు ఈ ధర్నా ప్రారంభించి మాట్లాడారు. ముందుగా గొల్లపల్లి ఇశ్రాయేలు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అరుంధతీయులకు దళిత వర్గాలకు కల్పించిన రిజర్వేషన్‌లో 3 శాతం అంతర్గత రిజర్వేషన్ కల్పించాలని టామ్స్ చేసిన కృషివల్ల దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి ఆ రిజర్వేషన్ కేటాయించారని, అందువల్ల అరుంధతీయుల్లో పలువురు నేడు వైద్యులు, ఇంజనీర్లు, సైంటిస్టులు తదితర ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఈ రిజర్వేషన్‌ను ప్రస్తుతం ఇతర వర్గాలకు కూడా వర్తింపజేసేలా జారీచేసిన జీవో రద్దు చేయడంతో పాటు ఎస్సీ ఏ జాబితాలో ఉన్న అన్ని ఉపకులాలకు ఒకే పేరుతో అరుంధతీయ ధ్రువీకరణ పత్రం అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో వేశపోగు ఇశ్రాయేలు, ఊటుకూరి దేవదానం, కె.ఆనందరావు, డి.రమేష్, జంగం సుబ్రమణ్యం, సూరిపోగు లక్ష్మయ్య, ఎయిర్‌పోర్ట్ భాస్కర్, ఎన్.యోబు. ఎం.లాజర్, వై.ఎలీషా, విడియల్ శేఖర్, వి.కలైఅరసు, విడుదలై కుమార్, ఎలిందురై సహా కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో ఆలయాల జీర్ణోద్ధరణ

● మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, జూన్ 25: రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన పురాతన ఆలయాలకు రూ.100 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టనున్నట్లు హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. అసెంబ్లీలో మంగళవారం ఉదయం రిషివంద్యం ఎమ్మెల్యే కార్తికేయన్ ఆలయాలకు సంబంధించి పలు ప్రశ్నలడిగారు. రిషివంద్యం పంచాయతీ పరిధిలోని ఆదిశ్రీరంగం రంగనాథ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం విడిది గృహం నిర్మించాలని కోరారు. ఆదిశ్రీరంగం రంగనాథ స్వామి ఆలయం స్వామివారు మత్స్య అవతారంతో వెలసిన మొట్టమొదటి ఆలయమని, ఈ ఆలయంలో రూ.10 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా భక్తుల కోసం రూ.86.50 లక్షలతో విడిదిగృహం నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 17 ఆలయాల్లో భక్తులకు విడిదిగృహాలు రూ.70 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కళ్లకుర్చి జిల్లా వరంజరం గ్రామంలోని పసుపతీశ్వర ఆలయానికి 1992లో చివరగా కుంభాభిషేకం జరిగిందని, ఈ ఆలయంతో పాటు పురాతనమైన ఆలయాలకు జీర్ణోద్ధరణ పనుల నిమిత్తం రూ.100 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

రాష్ట్రప్రభుత్వానికి హెచ్‌ఆర్సీ నోటీసు

పెరంబూర్, జూన్ 25: కళ్లకుర్చి కల్తీ సారా ఘటనకు సంబంధించి రాష్ట్రప్రభుత్వానికి మానవ హక్కుల సంఘం (హెచ్‌ఆర్సీ) నోటీసు జారీచేసింది. కళ్లకుర్చి కరుణాపురంలో కల్తీసారా తాగి 61 మంది మృతిచెందగా, 156 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో 96 మంది పరిస్థితి మెరుగుపడిందని వైద్యులు తెలుపగా, సంపూర్ణ ఆరోగ్యంతో 8 మంది డిశ్చార్జి అయ్యారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు సుమారు 20 మందిని సీబీసీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, కళ్లకుర్చి ఘటనపై రాష్ట్రప్రభుత్వానికి నోటీసు జారీచేసిన హెచ్‌ఆర్సీ, వారంలోగా సమగ్ర వివరాలు అందజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు ఉత్తర్వులు జారీచేసింది.

ఎన్నికల సమయంలో మరణించిన సిబ్బందికి పరిహారం పెంపు

పెరంబూర్, జూన్ 25: స్థానిక సంస్థల ఎన్నికల్లో విధినిర్వహణలో మృతిచెందిన, గాయపడిన సిబ్బందికి అందించే పరిహారం పెంచుతూ రాష్ట్రప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, ఎన్నికల విధుల్లో పాల్గొని సంఘ విద్రోహుల దాడిలో మృతిచెందే సిబ్బంది అందించే పరిహారం రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెరిగింది. అలాగే, ఇతర కారణాలతో మృతిచెందే వారికి అందించే పరిహారం రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచారు. శాశ్వతంగా భౌతిక నష్టం జరిగిన వారికి అందించే పరిహారం రూ.2.5 లక్షల నుంచి రూ.7.5 లక్షలు, స్వల్పంగా గాయపడే సిబ్బంది అందించే పరిహారం రూ.10,000 నుంచి రూ.40,000 పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

కల్లు విక్రయాలకు అనుమతి

● రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, జూన్ 25: కల్లు విక్రయాలకు అనుమతివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సమగ్ర వివరణ ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు మదురై బెంచ్ నోటీసు జారీచేసింది. పుదుకోట జిల్లాకు చెందిన నటరాజన్ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో... సెక్షన్ 47 ప్రకారం, ఆరోగ్యానికి హాని కలిగించే మాదకద్రవ్యాల విక్రయాలపై నిషేధం విధించడం సబబేనని, కానీ, ఆరోగ్యానికి హాని చేయని కల్లుపై నిషేధం విధించడం సరికాదన్నారు. ఈ పిటిషన్ మంగళవారం విచారించిన న్యాయమూర్తులు... ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం కావడంతో, ప్రభుత్వ స్పందన లేకుండా ఎలాంటి ఉత్తర్వులు జారీచేయలేమని స్పష్టం చేశారు. అదే సమయంలో కల్లు విక్రయాల అనుమతిపై సమగ్ర వివరణతో అఫిడవిట్ దాఖలుచేయాలని హోంశాఖ కార్యదర్శి న్యాయమూర్తులు ఉత్తర్వులు జారీచేశారు.

28 నుంచి వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్,జూన్25:వారాంతపు సెలవుల కారణంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. కిలంబాక్కం బస్టాండ్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియకుమారి తూత్తుకుడి, కోయంబత్తూర్, ఈరోడ్, తిరుప్పూర్ ప్రాంతాలకు 28వ తేది 265 ప్రత్యేక బస్సులు, 29న 320 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు బస్టాండ్ నుంచి తిరువణ్ణామలై, వేలాంకన్ని, నాగపట్టణం, బెంగళూరు, హోసూరు ప్రాంతాలకు 28,29 తేదీల్లో తలా 65 బస్సులు నడుపున్నారు. అలాగే, సొంతూళ్లకు వెళ్లిన వారు నగరానికి తిరుగొచ్చేలా ఆదివారం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్‌ఈటీసీ తెలిపింది.

ప్రేమ వివాహం చేసుకున్న కుటుంబం బహిష్కరణ

గ్రామస్థుల నిర్వాకం ● హైకోర్టు ఆదేశంతో వెలుగులోకి

అడయార్, జూన్ 25: కోయంబత్తూరు జిల్లాలోని అన్నూరు వడక్కలూరు అనే గ్రామంలో ప్రేమ వివాహం లేదా కులాంతర వివాహాలు చేసుకున్న కుటుంబాలను గ్రామస్థులు బహిష్కరించారు. ఈ విషయం హైకోర్టు ఆదేశంతో వెలుగులోకి వచ్చింది. ఈ గ్రామంలో దాదాపు 250 పైగా కుటుంబాలున్నాయి. ఇందులో సుందరం అనేవ్యక్తితోపాటు 15కుటుంబాలను గ్రామస్థులంతా బహిష్కరించారు. ఈ కుటుంబాలకు చెందిన వారు కులాంతర లేదా ప్రేమ వివాహాలు చేసుకోవడమే. ఈ కుటుంబాల వారిని ఎలాంటి ఆలయ వేడుకల్లో, ఊరేగింపులు పాల్గొనకుండా నిషేధం విధించారు. ఈ విషయంపై సుందర్ గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.దీంతో ఆయన మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. ఫలితంగా రంగంలోకి దిగిన ఆర్డీవో గోవిందన్ సారథ్యంలో అధికారుల బృందం గ్రామంలో విచారణ జరుపుతున్నారు.

తమిళనాడుకు 5.367 టీఎంసీలు

● కర్ణాటకకు కావేరి అథారిటీ ఉత్తర్వులు

పెరంబూర్, జూన్ 25: తమిళనాడు ఇవ్వాల్సిన 5.367 టీఎంసీల కావేరి జలాలు విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వానికి కావేరి మేనేజ్‌మెంట్ అథారిటీ ఉత్తర్వులు జారీచేసింది. ఢిల్లీలో కావేరి మేనేజ్‌మెంట్ అథారిటీ సమావేశం మంగళవారం ఆ విభాగం అధ్యక్షుడు ఎస్కే హల్దర్ నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. తమిళనాడు 5.367 టీఎంసీల నీటిని వెంటనే విడుదల చేయాలని, జూలై కి సంబంధించి 31.24 టీఎంసీల నీరు నిర్ణీత కాలంలో విడుదల చేయాలని కావేరి మేనేజ్‌మెంట్ అథారిటీ ఉత్తర్వులు జారీచేసింది.

కళ్లకుర్చి బాధితుల వద్ద సీబీసీఐడీ విచారణ

ప్యారీస్, జూన్ 25: కల్తీ సారా తాగి కళ్లకుర్చి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న 112 మంది బాధితులను సీబీసీఐడీ అధికారులు మంగళవారం విచారణ ప్రారంభించారు. కళ్లకుర్చి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారుల అనుమతితో బాధితులను వేర్వురుగా గదిలోకి పిలిచి కల్తీ సారా విక్రయాల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. కల్తీ సారా తయారీకి కొనుగోలు చేసిన మెథనాల్‌ను సరఫరా చేసిన ప్రధాన నిందితుడు మాదేష్, చిన్నదురై సహా 15 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్యాన్సీలాల్, సడయన్, రవి, సెంథిల్, ఏలుమలై, గౌతమ్‌లాల్ జైన్ సహా మరో ఆరుగురిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి 1,800 లీటర్ల మెథనాల్ స్వాధీనం చేసుకున్న సీబీసీఐడీ బాధితుల వాంగ్మూలాన్ని రికార్డు చేసింది.

కళ్లకుర్చి కేసు విచారణ నేటికి వాయిదా

పెరంబూర్, జూన్ 25: కళ్లకుర్చి దుర్ఘటనపై దాఖలైన కేసు విచారణను మద్రాసు హైకోర్టు బుధవారానికి వాయిదావేసింది. కళ్లకుర్చి ఘటనపై విచారణ సీబీఐకి అప్పగించాలంటూ పీఎంకే న్యాయవాది కె.బాలు పిటిషన్ దాఖలుచేశారు. ఇదివరకే అన్నాడీఎంకే దాఖలుచేసిన పిటిషన్‌తో కలిపి ఈ పిటిషన్ విచారించనున్నట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

కళ్లకుర్చి కల్తీసారా వ్యవహారం...

సీబీఐ విచారణ కోరుతూ పీఎంకే పిటిషన్

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి కరుణాపురంలో జరిగిన కల్తీసారా దుర్ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ పీఎంకే తరఫున హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పీఎంకే న్యాయవిభాగం అధ్యక్షుడు కే బాలు ఈ పిటిషన్ సమర్పించారు. కళ్ళకుర్చిలో పోలీసుస్టేషన్‌కు సమీపంలో కల్తీసారా యేళ్లతరబడి అమ్ముతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోలేదని, ఈ కారణంగానే కల్తీసారాకు 61 మంది ప్రాణాలు కోల్పోయారని, తెలిపారు. ఈ కల్తీసారా వ్యవహారంలో పుదుచ్చేరికి కూడా సంబంధం ఉండటంతో రెండు రాష్ట్రాలలోనూ సమగ్రమైన దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు ఆర్ మహాదేవన్, మహమ్మద్ సబీక్ విచారణ జరపనున్నారు.

సెంథిల్ బాలాజీ రిమాండ్ పొడిగింపు

ప్యారీస్, జూన్ 25: మనీ ల్యాండరింగ్ కేసులో అరెస్టయిన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను 41వ సారి పొడిగిస్తూ మద్రాసు సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మంత్రి హోదాలో చట్టవిరుద్ధంగా నగదు బట్వాడా చేశారని నమోదైన కేసులో గత ఏడాది జూన్ 14వ తేది మాజీ మంత్రి సెంథిల్ బాలాజీని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అరెస్ట్ చేసింది. బెయిలు కోరుతూ సెంథిల్ బాలాజీ తరఫున దాఖలుచేసిన పిటిషన్లు చెన్నై సెషన్స్ కోర్టు, మద్రాసు హైకోర్టులలో తిరస్కరణకు గురయ్యాయి. దీంతో ప్రస్తుతం సెంథిల్ బాలాజీ తరఫున సుప్రీంకోర్టులో దాఖలుచేసిన బెయిలు పిటిషన్ కూడా పెండింగ్‌లో ఉంది. పుళల్ జైలులో బందీగా ఉన్న సెంథిల్ బాలాజీ రిమాండ్ మంగళవారంతో పూర్తయిన నేపథ్యంలో, ఆయనను జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెన్నై సెషన్స్ కోర్టు న్యాయమూర్తి అల్లి సమక్షంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను జూలై 1వ తేది వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పురావస్తు తవ్వకాల్లో మట్టిబొమ్మలు లభ్యం



మహిళ బొమ్మ తల

ఐసిఎఫ్, జూన్ 25: విరుదునగర్ జిల్లా శివకాశి సమీపంలోని వెంబకోట కరిశల్‌కుళంలో పురావస్తు తవ్వకాల్లో మట్టిబొమ్మలు లభ్యమయ్యాయి. ఈ ప్రాంతంలో మూడో విడత తవ్వకాల్లో తొలివిడతగా మూడు చోట్ల గుంతలు తవ్వారు. ఇప్పటివరకు విరిగిన మట్టిబొమ్మలు, గాజు పూసలు సహా 50కి పైగా వస్తువులు లభించగా, సోమవారం తవ్వకాల్లో మట్టిబొమ్మల తలలు లభ్యమయ్యాయి. ఈ బొమ్మ తల 30.7 మి.మీ ఎత్తు, 25.6 మి.మీ వెడల్పు ఉన్నట్లు పురావస్తు పరిశోధకులు తెలిపారు. అలాగే, కృష్ణగిరి జిల్లా ఊతంగరై సమీపంలోని చెన్నానూరు లోయ ప్రాంతంలో సోమవారం చేపట్టిన తవ్వకాల్లో రాతియుగం నాటి పరికరం లభించింది. అది వ్యవసాయ పనిముట్టుగా ఉంటుందని పురావస్తు శాఖ డైరెక్టర్ భాస్కర్ పొన్నుస్వామి తెలిపారు.

సినీ సౌండ్ ఇంజనీర్‌ను నిర్బంధించి, దోపిడీ

బాలుడి సహా నలుగురి అరెస్టు

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలో సినీ సౌండ్ ఇంజనీర్‌ను రెండు రోజులపాటు నిర్బంధించి దాడి చేసి నగదు దోచుకున్న బాలుడు సహా నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కేకేనగర్ రాజమన్నార్ రోడ్డులో నివసిస్తున్న సురేష్ (56) సినీ సౌండ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనను డేటింగ్ పేరుతో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మాట్లాడి ఈ నెల 15న వడపళని ఆలయం వెనుకనున్న ప్రాంతానికి రమ్మన్నాడు. అతడి మాటలను నమ్మి వెళ్ళిన సురేష్‌పై ఇద్దరు మహిళలు సహా ఏడుగురు దాడికి దిగారు. ఆ తర్వాత అతడిని నిర్బంధించి గూగుల్‌పే ద్వారా రూ.27 వేల నగదు మోటారు బైకు దోచుకున్నారు. అంతటితో ఆగకుండా నగ్నంగా ఫొటో తీసి బెదిరించి పంపారు. తాము జరిపిన దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే అతడి అశ్లీల చిత్రాన్ని సోషల్ మీడియాలో విడుదల చేస్తామని హెచ్చరించారు. ఆ తర్వాత సురేష్ వడపళని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 17 యేళ్లబాలుడు సహా నలుగురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న శ్యామ్, ఇమ్మానువేల్, తమీమ్ అన్సారీ అనే ముగ్గురి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

రైతు హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

అడయార్, జూన్ 25: ఒక రైతు హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ తూత్తుక్కుడి జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. ఈ జిల్లాలోని మేల్‌పారైపట్టి కీళ్ వీధికి చెందిన అన్నాదురై (60) అనే రైతుకు భార్య, కుమారుడు ఉన్నాడు. ఇదే గ్రామానికి చెందిన ముత్తుమారియప్పన్ (41) అనే వ్యక్తితో అన్నాదురైకు అభిప్రాయభేదాలు ఉన్నాయి. దీంతో ముత్తుమారియప్పన్‌పై అన్నాదురై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కక్షగట్టిన ముత్తుమారియప్పన్... తన స్నేహితులు కరుప్పుస్వామి, బాలసుబ్రమణియన్‌తో కలిసి అన్నాదురైను హత్య చేశారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయగా, ఈ కేసు విచారణ జిల్లా కోర్టులో జరిగింది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి తాండవన్ నిందితులైన ముత్తుమారియప్పన్, కరుప్పుస్వామిలను దోషులుగా నిర్ధారించి జీవితఖైదు విధించారు. బాలసుబ్రమణియన్ కేసు విచారణలో ఉండగా మృతి చెందాడు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

●15 దుంగలు, 4 వాహనాల స్వాధీనం

మంగళం, జూన్ 25: ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా మల్లేపల్లి అటవీప్రాంతంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 15 ఎర్రచందనం దుంగలతోపాటు రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం మల్లేపల్లి అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. సమీపంలోని ఆటోనగర్ చేరుకునేసరికి అక్కడ కొందరు స్మగ్లర్లు రెండు కార్లలో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కనిపించారు. చుట్టుముట్టగా కొందరు పారిపోగా ఆరుగురు స్మగ్లర్లను పట్టుకున్నారు. విచారణలో వీరు కడపకు చెందిన యాతగిరి హరి(42), కొప్పిలి సుధాకర్‌రెడ్డి(29), తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ప్రభు(30), రమేష్(31), రవి(34), అయ్యప్పన్ మునియన్(20)గా గుర్తించారు. వీరి నుంచి రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలతోపాటు 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు స్మగ్లర్ల కోసం గాలిస్తున్నామని, అరెస్టు చేసిన వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు.



పట్టుబడ్డ స్మగ్లర్లు, ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

అత్తను చంపిన యువకుడికి యావజ్జీవం

ప్యారీస్, జూన్ 25: ఉల్లాసంగా గడిపేందుకు నిరాకరించిన మేనత్తను దారుణంగా హతమార్చిన యువకుడికి న్యాయస్థానం యావజ్జీవ జైలుశిక్ష విధించడంతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. స్థానిక క్రోంపేట భారతి పురానికి చెందిన జయమురుగన్ భార్య కృష్ణవేణి (35) ఆ ప్రాంతంలో నివసిస్తున్నారు. జయమురుగన్ సోదరి ఎగ్మూర్‌లో నివసిస్తుండగా ఆమె కుమారుడు అరుణ్‌కుమార్ (24) అప్పుడప్పుడూ క్రోంపేటలో ఉన్న మేనమామ ఇంటికి వెళ్లి వస్తుండేవాడు. ఆ సమయంలో అత్త కృష్ణవేణిపై మోజు పెంచుకున్న అరుణ్‌కుమార్ సంఘటన రోజు ఇంట్లో ఒంటరిగా ఉన్న కృష్ణవేణిపై అత్యాచారానికి ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించింది. దీంతో అరుణ్‌కుమార్ ఆమెను కత్తితో పొడిచి హత్యచేసి పరారయ్యాడు. 2016 జూన్ 14న జరిగిన ఈ దారుణంపై కేసు నమోదుచేసి విచారణ జరిపిన చిట్లపాక్కం పోలీసులు అరుణ్‌కుమార్ ఈ నేరానికి పాల్పడినట్లు నిర్ధారించి అతడిని అరెస్ట్ చేశారు. చెంగల్పట్టు మహిళా కోర్టులో సాగిన ఈ కేసు విచారణ పూర్తికావడంతో న్యాయమూర్తి ఎళిలరసి మంగళవారం, అరుణ్‌కుమార్‌కు యావజ్జీవ జైలుశిక్ష విధించారు. దీంతో పోలీసులు అతనిని పుళల్ జైలుకు తరలించారు.

కేసు విచారిస్తూ స్పృహతప్పిన హైకోర్టు న్యాయమూర్తి

పెరంబూర్, జూన్ 25: హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో న్యాయమూర్తి జస్టిస్ ఆదికేశవులు సోమవారం యథావిధిగా కేసు విచారణ చేపట్టారు. ఆ సమయంలో తలనొప్పిగా ఉందన్న న్యాయమూర్తి, హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయారు. గమనించిన కోర్టు సిబ్బంది, న్యాయవాదులు హైకోర్టు ప్రాంగణంలో ఉన్న అంబులెన్స్‌ను రప్పించారు. ప్రథమ చికిత్స అనంతరం మదురైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో ఉంచి న్యాయమూర్తికి చికిత్సలందిస్తున్నారు.

10 మంది నాగపట్టణం జాలర్ల అరెస్ట్

ప్యారీస్, జూన్ 25: బంగాళాఖాతంలో సముద్రపు సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారనే కారణంగా నాగపట్టణానికి చెందిన 10 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. నాగపట్టణం అక్కరై ప్రాంతానికి చెందిన ఆనంద్‌కు చెందిన మరపడవలో 10 మంది జాలర్లు ఈ నెల 21వ తేది సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వారు సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత 1.30 గంటల సమయంలో కొడిక్కరైకు తూర్పున సుమారు 40 నాటికల్ మైళ్ల దూరంలో నెడుందీవు పరిసరాల్లో చేపలు పడుతున్నారు. ఆ సమయంలో అటువైపు వచ్చిన శ్రీలంక నావికాదళం నాగపట్టణం జాలర్లను చుట్టుముట్టి, సరిహద్దులు దాటారంటూ అదుపులోకి తీసుకొని వారి పడవ కూడా స్వాధీనం చేసుకున్నారు. తమిళ జాలర్ల అరెస్టును ఖండిస్తూ నాగపట్టణం జిల్లా జాలర్ల సంక్షేమ సంఘం నిర్వాహకులు నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు జాలర్ల విడుదలకు రాష్ట్రప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

క్షతగాత్రులకు ఆల్కహాల్ పరీక్ష తప్పనిసరి

పెరంబూర్, జూన్ 25: రోడ్డు ప్రమాదాల్లో చిక్కుకుని ఆస్పత్రికి తీసుకొచ్చే క్షతగాత్రులకు ఆల్కహాల్ పరీక్ష తప్పనిసరిగా నిర్వహించాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేదీ విడుదల చేసిన ప్రకటనలో... మద్రాసు హైకోర్టు ఉత్తర్వుల మేరకు, రోడ్డు ప్రమాదాల్లో చిక్కుకుని ఆసుపత్రికి తరలించే క్షతగాత్రుల రక్తంలో ఆల్కహాల్ కలిసిందా అనే విషయాన్ని నిర్ధారించాలన్నారు. అందుకోసం క్షతగాత్రుడి నుంచి 5 మి.లీ రక్తం సేకరించి పరిశోధనలకు పంపాలని, ఈ నిబంధనను ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తప్పక పాటించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న 29 మంది అరెస్ట్

పెరంబూర్, జూన్ 25: నగరంలో గంజాయి సహా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న 29 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలో మాదకద్రవ్యాల అక్రమ తరలింపు, విక్రయాలను అడ్డుకొనేలా గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ 'డ్రైవ్ అగనెస్ట్ డ్రగ్స్' పేరుతో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఆ ప్రకారం, ఈ నెల 18 నుంచి 24వ తేది వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో మాదకద్రవ్యాలు తరలిస్తున్న ఘటనపై 19 కేసులు నమోదుచేసి 29 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 22 కిలోల గంజాయి, 40 నొప్పి నివారణ మాత్రలు, 9 సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్, రెండు ఆటోలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ నెల 24వ తేది వరకు మాదకద్రవ్యాల కేసుల్లో 162 మందిని గూండా చట్టం కింద అరెస్ట్ చేసినట్లు నగర పోలీసు కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

గంజాయి విక్రయించిన ఖాకీ అరెస్టు

అడయార్, జూన్ 25: ప్రముఖ పర్యాటక ప్రాంతం ఊటీలో గంజాయి విక్రయించిన ఓ కానిస్టేబుల్‌ను ప్రత్యేక పోలీస్ బృందం అరెస్టు చేసింది. రెండు రోజుల క్రితం ఊటీ బస్టాండు సమీపంలో పోలీసులు పెట్రోలింగ్‌లో నిమగ్నమైవున్నారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఒకదానికొకటి పొంతనలేకుండా సమాధానాలు చెప్పారు. దీంతో అతడి బ్యాగు తనిఖీ చేసి 200 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వ్యక్తిని సౌందర్‌రాజన్ (29)గా గుర్తించారు. ఈయన... నీలగిరి జిల్లా పిల్లూరు రిజర్వాయర్ రక్షణగా విధులు నిర్వహిస్తున్నట్టు తేలింది. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నకిలీ బిల్లులతో మెథనాల్ కొనుగోలు

● సీబీసీఐడీ దర్యాప్తులో వెల్లడి

అడయార్, జూన్ 25: కళ్ళకుర్చి కల్తీసారా కేసు దర్యాప్తును సీబీసీఐడీ ముమ్మరం చేసింది. ఈ విచారణలో విస్తుగొల్పే విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కేసులో అరెస్టయిన మాధేష్ అనే నిందితుడు చెన్నైలోని ఒక కెమికల్ ఫ్యాక్టరీ నుంచి నకిలీ బిల్లులు సమర్పించి 19 బ్యారెల్లలో మెథనాల్ కొనుగోలు చేసినట్టు తేలింది. ఇలా కొనుగోలు చేసిన మెథనాల్‌ను కల్తీసారా వ్యాపారులతో ఒక నెట్‌వర్క్ ఏర్పాటుచేసి, వారికి ఎలాంటి ఆటంకం లేకుండా సరఫరా చేసినట్టు గుర్తించారు. సారా వ్యాపారులకు విక్రయించగా మిగిలిన మెథనాల్‌ను లారీ టైర్ ట్యూబ్‌ల్లో నింపి, వాటిని భూమిలో భద్రపరిచేవాడని తేలింది. ఇలా భద్రపరిచిన 60 లీటర్ల సామర్థ్యం కలిగిన 20 టైర్ ట్యూబ్‌ల నుంచి 1200 లీటర్ల మెథనాల్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.


కడలూరు సీఐ కోలుకోవాలని పోలీసుల సామూహిక ప్రార్థన



రాజగోపాలస్వామి ఆలయంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ఎస్ఐలు, పోలీసులు

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యంతో చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కడలూరు పుదునగర్ సీఐ గురుమూర్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పోలీసులు పుదుపాళయం రాజగోపాలసామి ఆలయంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కడలూరులో సీఐగా పని చేస్తూ గురుమూర్తి అటు ప్రజల దగ్గర, ఇటు సహోద్యోగుల వద్ద మంచి పేరు తెచ్చుకున్నారు. గురుమూర్తి సతీమణి గీత కూడాసీఐగానే పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజులకు ముందు సీఐ గురుమూర్తి తీవ్ర అస్వస్థతకు గురై పుదుచ్చేరిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. ఆయన పరిస్థితి విషమంగా మారటంతో మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తీవ్ర అత్యవసర విభాగంలో ఆయన చికిత్స పొందుతున్నారు.ఈపరిస్థితులలో గురుమూర్తి త్వరగా కోలుకోవాలని కడలూరు డీఎస్పీ ప్రభు ఆధ్వర్యంలో ఎస్ఐలు కదిరవన్, రుదిరాంబాళ్, కవియరసన్, స్పెషల్ ఎస్ఐ రామచంద్రన్, హెడ్‌కానిస్టేబుల్ అరుళ్ తదితర పోలీసులంతా కలిసిరాధాగోపాలసామి ఆలయంలో సామూహికప్రార్థనలు జరిపారు.

కళాశాల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య



తరణి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూన్ 25: తిరుచ్చి సమయపురంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న పుదుకోటకు చెందిన విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విద్యార్థిని మృతిపై ఆమె తండ్రి బాలాజీ మీడియాతో మాట్లాడుతూ.. కుమార్తె హఠాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో సొంతూరు వెళ్లేందుకు సెలవు కావాలని కళాశాల యజమాన్యాన్ని కోరిందని, అందుకు నిరాకరించిన యాజమాన్యం ఆమెను తీవ్రంగా దూషించినట్లు తెలిసిందన్నారు. తనను వెంటనే తీసుకెళ్లాలని కోరడంతో తాను కళాశాలకు రాగా, అప్పటికే ఆమె ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కళాశాల యాజమాన్యం తెలిపిందన్నారు. కాగా, విద్యార్థిని చదువుతున్న కళాశాల తిరుచ్చి మనచ్చనల్లూర్ నియోజకవర్గ డీఎంకే ఎమ్మెల్యే కదిర్‌వేలుది కావడం కొసమెరుపు.



మీడియా సమావేశంలో చిత్ర బృందం

మనం లేకుండా అవినీతి జరుగుతుందా?

ప్రశ్నించిన కమల్ హాసన్

● 'ఇండియన్-2' ట్రైలర్ రిలీజ్ ● మూడో భాగం కూడా


వేదికపై కమల్ హాసన్, శంకర్, సిద్దార్థ్, అనిరుధ్ తదితరులు

దేశంలో అవినీతి పెరిగిపోవడానికి కేవలం రాజకీయ నేతలు మాత్రమే కారణం కాదనీ, ప్రజలు కూడా కారణమని, మనం లేకుండా అవినీతి జరుగుతుందా? అంటూ అగ్ర నటుడు కమల్ హాసన్ ప్రశ్నించారు. ఎస్.శంకర్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్, రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మించిన 'ఇండియన్-2' చిత్రం ట్రైలర్ మంగళవారం నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమల్ హాసన్, శంకర్, సంగీత దర్శకుడు అనిరుధ్, నటులు సిద్దార్థ్, బాబీ సింహా తదితరులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా కమల్ హాసన్ మాట్లాడుతూ, '1996లో 'ఇండియన్ డబ్బింగ్ చెప్పేటపుడే రెండో భాగం గురించి మాట్లాడుకున్నాం. 'ఇండియన్-2' మూవీకి మూల కథ అందిస్తున్న రాజకీయ నేతలకు ధన్యవాదాలు. ఎందుకంటే అవినీతి పెరిగిపోవడం వల్లే ఇండియన్ తాత రెండోసారి మీ ముందుకు వచ్చేందుకు ఒక మార్గం లభించింది. నేను, శంకర్ మళ్ళీ అనుకున్నప్పటికీ ఇలాంటి చిత్రాన్ని నిర్మించలేమని కెమెరామెన్ రవివర్మన్ అంటున్నారు. కానీ, అలాంటి చిత్రాన్ని నిర్మించాం. అదే 'ఇండియన్-2' సినిమా. దేశంలో అవినీతి పెరిగిపోవడానికి కారణం కేవలం రాజకీయ నేతలు మాత్రమే కాదు. మనం కూడా. మనం లేకుంటే అవినీతి జరుగుతుందా? అని కమల్ ప్రశ్నించారు. దర్శకుడు ఎస్.శంకర్ మాట్లాడుతూ, 'నేడు సమాజంలో నెలకొనివున్న పరిస్థితుల్లో ఇండియన్ తాత వస్తే ఎలా ఉంటుందన్నదే ఈ చిత్ర కథ. తొలి భాగం తమిళనాడులో జరిగే సంఘటనలతో తెరకెక్కించాం. రెండో భాగంలో రాష్ట్ర సరిహద్దులనుదాటి ఇతర రాష్ట్రాల్లో జరిగే సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుందని గట్టిగా నమ్ముతున్నాను. సినిమా చాలా బాగా వచ్చింది. దానికి కారణం కమల్ హాసన్. తొలి భాగానికి 40 రోజుల సమయం కేటాయిస్తే, రెండో భాగానికి 70 రోజులు ఇచ్చారు. మేకప్ వేయడానికి తీయడానికి ఒక గంట పట్టేది. అందుకే లొకేషన్‌కు అందరికంటే ముందు, సాయంత్రం అందరికంటే ఆఖరులో వెళ్ళేవారు. ఇందులో కమల్ హాసన్ నటన తొలి భాగం కంటే చాలా బాగా ఉంటుంది. హీరోకు ఎలాంటి ఛాలెంజెస్ ఇచ్చినా వాటిని అద్భుతంగా పూర్తి చేస్తారు. ఆయనపై సన్నివేశాలు చిత్రీకరించే సమయంలో పలు సందర్భాల్లో ఆశ్చర్యపోయాను. సినిమాలోని ప్రతి ట్యూన్ వందకు వంద శాతం పర్ఫెక్ట్' అని శంకర్ పేర్కొన్నారు. ఆ తర్వాత సిద్ధార్థ్, అనిరుధ్, బాబీ సింహాతో పాటు లైకా ప్రొడక్షన్స్ హెడ్ తమిళ్ కుమరన్ తదితరులు మాట్లాడారు.

పా.రంజిత్ నిర్మాణంలో

'బాటిల్ రాధ'

ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ తన సొంత సంస్థ నీలం ప్రొడక్షన్ పతాకంపై నిర్మిస్తున్న కొత్త చిత్రానికి 'బాటిల్ రాధ' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. గురు సోమసుందరం, సంజన నటరాజన్, జాన్ విజయ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా కామెడీ, ఎమోషనల్, రోలర్ కోస్టర్‌గా రూపొందిస్తున్నారు. దినకరన్ శివలింగం దర్శకత్వం వహించిన ఈ సినిమాకు సీన్ రోల్డన్ సంగీతం సమకూర్చుతున్నారు. కాగా, 'అట్టకత్తి' చిత్రం ద్వారా కోలీవుడ్‌లో దర్శకుడిగా పరిచయమైన పా.రంజిత్.. ఆ తర్వాత కార్తీతో తెరకెక్కించిన 'మద్రాస్' సినిమాతో ఇండస్ట్రీ హిట్ కొట్టి, తన మూడో చిత్రంతోనే సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్రానికి డైరెక్ట్ చేసే గోల్డెన్ ఛాన్స్ కొట్టేశారు. అలా కోలీవుడ్‌లో తన జర్నీని కొనసాగిస్తున్న పా.రంజిత్... నీలం ప్రొడక్షన్ అనే నిర్మాణ సంస్థ నెలకొల్పి సందేశాత్మక చిత్రాలను నిర్మిస్తూ శెభాష్ అనిపించుకుంటున్నారు. ఈ కోవలోనే ఇపుడు 'బాటిల్ రాధ' చిత్రాన్ని మంచి కథాంశంతో రూపొందిస్తున్నట్టు వెల్లడించారు.


'బాటిల్ రాధ' ఫస్ట్‌లుక్



రైజా విల్సన్ ఎక్స్‌పోజింగ్!!

చిత్రజ్యోతి

బిగ్‌బాస్ తమిళ సీజన్‌లో పాల్గొన్న వారిలో ఒకరైర రైజా విల్సన్... ఆ తర్వాత వెండితెరకు పరిచయమైంది. 'ప్యార్ ప్రేమ కాదల్' అనే చిత్రంలో ఆమె తొలిసారి నటించగా, అందులో ఆమె నటనకు యూత్ ఫిదా అయింది. ఆ తర్వాత ఆమె నటించిన చిత్రాలు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. దీంతో ఆమె వెండితెరకు కాస్త దూరంగా ఉంటున్నా సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటూ సినిమా ఛాన్సుల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు, అపుడపుడూ టూపీస్ దుస్తుల్లో స్పెషల్ ఫొటో షూట్ చేసి వాటిని ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో షేర్ చేస్తోంది. తాజాగా రైజా విల్సన్ ఎక్స్‌పోజ్ చేస్తూ దిగిన ఫొటోలను షేర్ చేస్తూ వాటి కింద హార్ట్ ఎమోజీలను అటాచ్ చేశారు.

రోబోటిక్ సాయంతో వంద క్యాన్సర్ సర్జరీలు సక్సెస్



అడయార్, జూన్ 25: నగరంలోని గ్లెనెగల్స్ హెల్త్ సిటీ యేడాదికాలంలో రోబోటిక్ సాయంతో 100కుపైగా క్యాన్సర్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసినట్టు ఆస్పత్రి ప్రకటించింది. సక్సెస్‌ఫుల్ ఆపరేషన్లు చేయించుకున్న రోగుల్లో దేశంలోనే తొలిసారిగా హెప్‌ఐపీఈసీతో రోబోటిక్ సైటోరేడక్టివ్ సర్జరీ చేయించుకున్న 82 యేళ్ళ వృద్ధురాలు కూడా ఉన్నారు. ఈ మహిళ అండాశయ క్యాన్సర్ మూడో దశతో బాధపడుతూ రాగా, ఈమెకు విజయవంతంగా ఆపరేషన్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఒక సదస్సులో అగ్రహీరో కమల్ హాసన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంకేతిక నైపుణ్యానికి మించి, రోబోటిక్ సర్జరీని స్వీకరించడం వైద్య సాంకేతికను అభివృద్ధి చేయడంతో మనదేశం నిబద్ధతను ప్రతిబింబిస్తుందని, గత యేడాది కాలంలో వందకుపైగా రోబోటిక్ క్యాన్సర్ సర్జరీలు చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆ హాస్పిటల్ సీఈవో అనురాగ్ యాదవ్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో కమల్ హాసన్ తదితరులు

విక్రవాండిలో ఊపందుకున్న ప్రచారం

పెరంబూర్, జూన్ 25: విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. జూలై 10న జరుగనున్న ఈ ఎన్నికల్లో డీఎంకే తరఫున అన్నియూర్ శివ, పీఎంకే తరఫున అన్బుమణి, నామ్ తమిళర్ పార్టీ తరఫున డా.అభినయ సహా 29 మంది పోటీచేస్తున్నారు. ప్రస్తుతం నామినేషన్ల పరిశీలన ముగిసిన నేపథ్యంలో, తుది జాబితా బుధవారం వెలువడనుంది. ఈ నేపథ్యంలో, నియోజకవర్గంలో ప్రచారం ఊపందుకుంది. సోమవారం డీఎంకే అభ్యర్థికి మద్దతుగా పశుసంవర్ధక శాఖ మంత్రి అనితా రాధాకృష్ణన్ తిరునందిపురం, పిడారిపట్టు, ఎస్.కున్నతూర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సీఎం స్టాలిన్ మూడేళ్ల పాలన ఆదరించిన ప్రజలు ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 40 స్థానాల్లో డీఎంకే కూటమి అభ్యర్థులను గెలిపించారని, విక్రవాండి ఉప ఎన్నికలోను అదే ఫలితాలు పునరావృత్తమవుతాయని మంత్రి తెలిపారు.

డీఎంకే అభ్యర్థి శివకు మద్దతుగా ప్రచారం చేస్తున్న మంత్రి అనితా రాధాకృష్ణన్ →



గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన 95 మందికి నియామక ఉత్తర్వులు


సచివాలయంలో నియామక ఉత్తర్వులు స్వీకరించిన అభ్యర్థులతో ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి తంగం తెన్నరసు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా తదితరులు

● సీఎం స్టాలిన్ అందజేత

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత మూడేళ్లుగా టీఎన్‌పీఎస్సీ, పోలీసు సెలక్షన్ కమిటీ, మెడికల్‌బోర్డు, టీచర్స్ సెలక్షన్ కమిటీ తదితర సంస్థలు నిర్వహించిన పరీక్షలలో గ్రూప్-1 హోదా ఉద్యోగాలకు ఎంపికైన 85 మందికి ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక ఉత్తర్వులు అందజేశారు. సచివాలయంలో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ పోస్టుకు ఎంపికైన 21 మందికి, ఏసీపీ పోస్టులకు ఎంపికైన 26 మందికి, ఆదాయపన్నుల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పోస్టులకు ఎంపికైన 25 మందికి, సహకార సంఘాల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టులకు ఎంపికైన 13 మందికి, గ్రామీణాభివృద్ధి శాఖలో సహాయ సంచాలకుల పోస్టుకు ఎంపికైన ఏడుగురికి, జిల్లా ఉపాధి కల్పనాకేంద్రం అధికారి పోస్టులకు ఎంపికైన ముగ్గురికి ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక పత్రాలు అందజేశారు. వారందరికీ జూలై ఒకటి నుంచి అన్నా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీలో శిక్షణ ప్రారంభమవుతుందని స్టాలిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి తంగం తెన్నరసు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, మానవవనరుల శాఖ కార్యదర్శి కె.నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ప్రధాని వీపీ సింగ్ జయంతి సందర్భంగా చెన్నై రాజధాని కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి, చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు ఎంపీ సామినాధన్, ఆర్ఎస్ రాజకన్నప్పన్, ఆర్ చక్రమణి, ఎం. సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు


ఆలయ ప్రాంగణంలోని వేప చెట్టు నుంచి కారుతున్న పాలు లాంటి ద్రవం

వేప చెట్టు నుంచి పాలు

● భక్తుల పరవశం

పెరంబూర్, జూన్ 25: తన్నాసియప్పర్ ఆలయ వేప చెట్టు నుంచి పాలు కారుతుండడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నీలగిరి జిల్లా పొంగలూరు పంచాయతి పాపనాయకన్‌పాళయం గ్రామంలో 200 ఏళ్లనాటి తన్నాసియప్పర్ ఆలయంలో ప్రతి అమావాస్యకు పూజలు నిర్వహిస్తుంటారు. ఆలయ ప్రాంగణంలో 30 అడుగుల వేప చెట్టు ఉంది. ఈ చెట్టు నుంచి 8 రోజుల క్రితం పాలు కారడం ప్రారంభమైంది. సోమవారం కూడా పాలు కారుతుండడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆలయానికి చేరుకొని వేప చెట్టుకు పాలు కారడం గమనించి ప్రత్యేక పూజలు చేశారు.

మాల్దీవులకు ఊటీ బంగాళాదుంపలు

పెరంబూర్, జూన్ 25: మాల్దీవులకు ఊటీ బంగాళా దుంపల ఎగుమతులు పెరిగాయి. అదే సమయంలో దిగుబడి తగ్గడంతో వాటి ధరలు కూడా పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మేట్టుపాళయం గాంధీ మైదానం, నెల్లిదురై రోడ్డు తదితర ప్రాంతాల్లో సుమారు 70కి పైగా బంగారు దుంపల మండీలున్నాయి. ఇక్కడికే గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్ర ఇందూర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రా, కర్ణాటక రాష్ట్రం ఉడయార్‌పాళయం, సామ్రాజ్‌నగర్, కోలార్ తదితర పొరుగు రాష్ట్రాలు, రాష్ట్రంలోని నీలగిరి జిల్లా ఊటీ సహా పలు ప్రాంతాల నుంచి బంగాళా దుంపలు విక్రయానికి వస్తుంటాయి. ఇక్కడ బంగాళా దుంపలను నాణ్యత బట్టి విభజించి మాల్దీవులు, శ్రీలంకకు తూత్తుకుడి హార్బర్ నుంచి నౌకల ద్వారా ఎగుమతి చేస్తుంటారు. ఊటీ బంగాళా దుంపలకు ప్రత్యేక రుచి, సువాసన ఉండడంతో, ఇతర రాష్ట్రాల బంగాళా దుంపల కంటే మాల్దీవులకు ఊటీ బంగాళా దుంపలు అధికస్థాయిలో ఎగుమతి చేస్తున్నారు. ఆ ప్రకారం, 456 కిలోల బరువు కలిగిన ఊటీ బంగాళా దుంపల బస్తా రూ.2,500 నుంచి రూ.3,300 వరకు విక్రయమవుతోంది. అదే సమయంలో, గుజరాత్ బంగాళా దుంపలు రూ.1,300 నుంచి రూ.1,650, కోలార్ బంగాళా దుంపలు రూ.1,600 నుంచి రూ.1,800, ఆగ్రా బంగాళా దుంపలు రూ.1,1000 నుంచి రూ.1,400 ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని మండీ నిర్వాహకులు తెలిపారు.


బంగాళా దుంపలను విభజిస్తున్న కార్మికులు


ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెబుతున్న ద్రావిడదేశం వ్యవస్థాపకులు వి.కృష్ణారావు

కాళికాంబాళ్ ఆలయ ఎన్నికల రద్దు కోరుతూ పిటిషన్

● తోసిపుచ్చిన హైకోర్టు

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్ కార్నర్ తంబుశెట్టి వీధిలోని కాళికాంబాళ్ ఆలయ ట్రస్టుబోర్డు ఎన్నిక చెల్లవని ఉత్తర్వు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. విల్లివాక్కం ప్రాంతానికి చెందిన జయరాజ్‌గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌లో కాళికాంబాళ్ ఆలయానికి ఐదుగురు ట్రస్టీలను ఎన్నికల ద్వారా ఎంపిక చేయాల్సి ఉందని, వీరిలో ఒకరే నిర్వహణ బాధ్యతలు చేపట్టే ట్రస్టీగా ఎంపిక కావాల్సి ఉందని, అయితే ఈ నిబంధనలను ఉల్లఘించి సర్వేశ్వరన్‌ను నిర్వాహక ట్రస్టీగా ఎంపిక చేయడం గర్హనీయమన్నారు. ఈ పరిస్థితులలో సర్వేశ్వరన్ నిర్వాహక ట్రస్టీగా కొనసాగకుండా స్టే విధించాలని, అదే సమయంలో ట్రస్టీల ఎంపిక కోసం జరిగిన ఎన్నికలను కూడా రద్దు చేయాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి నక్కీరన్ ఎదుట విచారణకు వచ్చింది. కాళికాంబాళ్ ట్రస్టీల పదవులకు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాయని, ఐదుగురు ట్రస్టీలు ఎన్నికై, ట్రస్టీల అధ్యక్షుడిగా ఈ.ఎం. మోహనాచ్చారి ఎన్నికయ్యారని, సాఫీగా జరిగిన ఆ ఎన్నికల్లో ఎక్కడా అక్రమాలు జరుగలేదని ట్రస్టీల తరపు న్యాయవాది పేర్కొన్నారు. పిటిషనర్ జయరాజ్ గోపాల్ ఎన్నికల్లో ఓటమిపాలైన ఓ జ్యోతిష్యుడి ప్రోద్బలంతోనే తప్పుడు ఆరోపణలు చేశారని తెలిపారు. అంతేకాకుండా గత యేడాది ఆలయంలో ఏర్పడిన సమస్యల సందర్భంగా పిటిషనర్ జయరాజ్ గోపాల్‌పై కేసు నమోదైందని, ఆ పాతకక్షతోనే ఆయన ఈ పిటిషన్ వేశారని తెలిపారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి పిటిషనర్ తన ఆరోపణలకు సంబంధించి తగిన ఆధారాలు సమర్పించకపోవడంతో పిటిషన్‌ను తోసిపుచ్చుతూ ఉత్తర్వు జారీ చేశారు.


కాళికాంబాళ్ ఆలయ చైర్మన్ మోహనాచారితో ట్రస్టీలు

గుడ్ డీడ్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా ఆరోగ్య శిబిరం

అడయార్, జూన్ 25: ప్రముఖ సామాజిక కార్యకర్త అప్సర రెడ్డికి చెందిన గుడ్ డీడ్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరం ద్వారా వలసరవాక్కం, సాలిగ్రామం ప్రాంతాలకు చెందిన దాదాపు 500 మందికి పైగా స్థానికులు పాల్గొని వైద్య పరీక్షలను జరుపుకున్నారు. ఈ మెగా హెల్త్ శిబిరం విజయవంతం కావడానికి ఈసీఆర్ రోటరీ క్లబ్‌కుచెందిన డాక్టర్ ప్రమీల, సుమా హరీస్ జయరాజ్‌లు తమవంతు సహకారం అందించారు. ఈ వైద్య శిబిరంలో అనేక రకాలైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.


ఆరోగ్య శిబిరంలో అప్సర రెడ్డి తదితరులు

ఘనంగా మహిళాసభ సర్వసభ్య సమావేశం

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ (మద్రాస్ యూనిట్) వార్షిక సర్వ సభ్య సమావేశం మంగళవారం ముగిసింది. స్థానిక అన్నాసాలైలో ఉన్న కాస్మోపోలిటన్ క్లబ్‌లో జరిగిన ఈ సమావేశానికి సభ చైర్‌పర్సన్ అనితా రమేష్ స్వాగతం పలికారు. కార్యదర్శి కర్లపాటి లక్ష్మి 40వ వార్షిక సర్వసభ్య సమావేశం మినిట్స్ నివేదికను వినిపించారు. కోశాధికారి వసుంధర సభ పద్దులను నివేదించారు. ఈ సందర్భంగా మహిళా సభ అరుణ్ పెరుంజ్యోతి అన్నదాన మిషన్‌కు రూ.27వేలు, ఆగల్ ఫౌండేషన్ ట్రస్టుకు కూడా రూ. 27వేలు విరాళంగా అందజేశారు. అంతేకాకుండా ఫౌండేషన్‌కు చెందిన దివ్యాంగ మహిళల కోసం శానిటరీ నాప్కిన్లను విరాళంగా అందించారు.



ఎమర్జెన్సీ చీకటి రోజులు వెంటాడుతున్నాయ్

● గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో 1975, జూన్ 25న అమలులోకి వచ్చిన ఎమర్జెన్సీ రోజుల్లో తనకెదురైన చేదు అనుభవాలు తననింకా వెంటాడుతూనే ఉన్నాయని గవర్నర్ ఆర్ ఎన్ రవి పేర్కొన్నారు. ఈ మేరకు తన ఎక్స్ పేజీలో ఓ సందేశం పోస్టు చేశారు. రాజ్యాంగ ధర్మాసనాన్ని ఉల్లఘించి, పౌర ప్రాథమిక హక్కులను హరించి, ప్రసారమాధ్యమాల నోళ్లు మూయించిని ఆ రోజులు దేశానికి చీకటి రోజులేనని తెలిపారు. న్యాయశాఖను సైతం అణచివేసిన ఆ నాటి పాలకుల చేతుల్లో ప్రజాస్వామ్యం భ్రష్టుపట్టిందన్నారు. సాయుధులైన సైనికులు తమ శిబిరంలోకి చొరబడి గదులలోని వస్తువులన్నింటిని ధ్వంసం చేసి తుపాకీలతో దాడి జరిపి దుస్తులు, పుస్తకాలను వెంట తీసుకెళ్లడానికి కూడా అనుమతించకుండా బలవంతంగా బయటకు పంపారని తెలిపారు. ఆ చీకటి రోజులను తాను తనతోపాటు చదువుకున్న యూనివర్సిటీ విద్యార్థులను ఎలా మరచిపోగలమని ప్రశ్నించారు. భారత మాతకు వెన్నుపోటు పొడిచిన దుర్దినాన్ని దేశ ప్రజలెవరూ మరచిపోలేరని గవర్నర్ రవి పేర్కొన్నారు.

